# ఘనంగా సంక్రాంతి సంబరాలు


వివరాలు లోపలి పేజీల్లో

18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 10 జనవరి 2025 పేజీలు 8

# సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరించుదాం







**నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే లక్ష్యం - ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు**

**నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2024-25 ను ప్రారంభించిన మంత్రి ఎస్.సవిత**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎగ్జిబిషన్లు, ఎక్స్ పోలు నిర్వహణతో చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగాయాని మంత్రి తెలిపారు. గురువారం ఆమె విజయవాడ నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2024-25ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి, ఏ రాష్ట్రం నుంచి వచ్చారు...అమ్మకాలు ఎలా జరుగుతున్నాయి..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన ను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఎంతో కీలకమైన చేనేతకు సీఎం చంద్ర బాబు అండగా ఉంటున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించడానికి రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుం టున్నామని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను నిర్వహిస్తున్నామన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్ పోలో 49 స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు 2



# 20 నుంచి రీ సర్వే

**పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే చేయాలి : కృష్ణా జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం రీ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా సర్వే భూమి రికార్డుల శాఖ ఆధ్వర్యంలో రీ సర్వే ప్రక్రియపై కృష్ణా యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనం ఆడిటోరియంలో గురువారం రెవెన్యూ అధికారులు, సిబ్బందికి కార్యశాల నిర్వహించారు. ఉదయం బందరు డివిజన్ పరిధిలోని వారికి, మధ్యాహ్నం ఉయ్యూరు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఇరువురు రీ సర్వే ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ రీ సర్వే రాబోయే సంవత్సరాలలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా పక్కా ప్రణాళికతో మిగతా 2లో

# వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు**

**ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నాం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 9, మేజర్ న్యూస్ :** శుక్రవారం ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని.. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి వివిధ ఆలయాల ఈవోలు, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో చేస్తున్న ఏర్పాట్లపై 2లో

(మొదటిపేజీ తరువాయి)

## 20 నుంచి రీ సర్వే

పకడ్బందీగా చేపట్టాలన్నారు. జనవరి 20వ తేదీ నుంచి జిల్లాలో రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ, మండల సర్వేయర్లు రీ సర్వే ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తారని, సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా నాణ్యమైన రీ సర్వే చేయాలన్నారు. సమస్యలు గల భూముల విషయంలో జాగ్రత్త వహించాలని, అనుభవదారులు హక్కుదారులు, ప్రైవేటు ప్రభుత్వ భూములు, భూ సేకరణ భూములు గుర్తించి నమోదు చేయడంలో క్షుణ్ణంగా పరిశీలించాలాన్నారు.రికార్డుల ప్రకారం సక్రమంగా ఉంటూ భూ యజమానులు లేదా రైతులకు సంబంధించిన భూ విస్తీర్ణం, భూ సరిహద్దులు వంటి వివాదాలను ఇరువురికి సమ్మతంగా ఉంటే సాధ్యమైనంతవరకు క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు.రీ సర్వే సమయంలో భూమికి సంబంధించిన వ్యక్తులు స్వగ్రామంలో కాకుండా రాష్ట్రంలో లేదా ఇతర ప్రాంతాలలో ఉంటున్నట్లయితే వారికి తప్పనిసరిగా సమాచారం అందించి పిలిపించాలని, ఇతర దేశాలలో నివసిస్తున్న వారి విషయంలో వారు సూచించిన వ్యక్తుల సమక్షంలో రీ సర్వే చేయాలన్నారు.భూమి నిజనిర్ధారణ (గ్రౌండ్ ట్రూతింగ్), భూమి ధ్రువీకరణ (గ్రౌండ్ వాలిడేషన్) ప్రక్రియలు సక్రమంగా జరిగితే రీ సర్వేలో నాణ్యమైన ఫలితాలు పొందవచ్చని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన హ్యాండ్ బుక్ ను సమగ్రంగా చదివి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ ప్రారంభించేముందు అందుకు సంబంధించిన వివరాలతో ఆయా గ్రామాలలో గ్రామసభతో పాటు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో పాటు ఆయా గ్రామాలలోని భూ యజమానులు రైతులతో కూడిన ఫోన్ నెంబర్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏ రోజున ఏ సర్వే నంబర్లు రీ సర్వే చేస్తున్నదీ సమాచారం అందించాలని సూచించారు. అనంతరం వారు రీ సర్వే ప్రక్రియపై రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖర్ రావు, కే ఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల అధికారులు కే స్వాతి, బీఎస్ హేలా షారోన్, తహసీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

### వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు

సమీక్షించారు. భక్తులకు సులభంగా దర్శనాలు జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని.. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వేదాద్రి నరసింహ స్వామి ఆలయం, నెమలి శ్రీ వేణుగోపాల స్వామి అలయం, విజయవాడ బ్రాహ్మణ వీధి, లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద అసౌకర్యం అనే మాట లేకుండా క్యూలైన్లు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎస్ఐ తదితర క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పవిత్ర వైకుంఠ ఏకాదశి దర్శనాల ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పాట్లపై ప్రముఖ ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నామని.. దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందాలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఆలయాలను సందర్శించి పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు తదితరాల విషయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా దేవాదాయ అధికారి పి.సీతారామయ్య, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్, వివిధ ఆలయాల ఈవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గోదాములను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి



**గుడివాడ, మేజర్ న్యూస్:** గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములను పూర్తిస్థాయిలో వినియోగములోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరావు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుని కలిసి కోరారు. గోదాములను వినియోగములకు తెచ్చేలా అధికారులకు వెంటనే ఆదేశాలు ఇస్తామని మంత్రి కింజారపు అచ్చం నాయుడు రావికి హామీ ఇచ్చారు.

# సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరించుదాం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి వెల్లడించారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్, బీహార్‌కు చెందిన 49 మంది చేనేత కార్మికులు, సొసైటీలు స్టాళ్లు ఏర్పాటు చేశాయన్నారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి దృష్టికి రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యలను తీసుకెళ్లినట్లు మంత్రి వెల్లడించారు.

**చేనేతతో సంక్రాంతిని చేసుకుందాం...**

చేనేత వస్త్రాలు తెలుగు సంప్రదాయానికి ప్రతీక అని మంత్రి సవిత తెలిపారు. రాబోయే సంక్రాంతికి ప్రజలంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని పిలుపునిచ్చారు. తెలుగింటి పెద్దపండగ సంక్రాంతిని చేనేతతో జరుపుకుందామన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని మంత్రి సవిత కోరారు.

**365 రోజులూ పని కల్పిస్తాం...**

చేనేత కార్మికులకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. నీచే హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో సందర్శించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి సవిత మాట్లాడారు. రాష్ట్రంలో ఉప్పాడ జాంధాని చీరలు, మంగళగిరి చీరలు, వెంకటగిరి చీరలు, ధర్మవరం పట్టు చీరలు...ఇలా రాష్ట్రంలో 35 రకాల నాణ్యమైన చేనేత వస్త్రాలను నేతన్నలను తయారు చేస్తున్నారన్నారు. ఇలా తయారు చేస్తున్న చేనేత వస్త్రాలకు కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. చేనేతకు చంద్రబాబు పాలన ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి తెలిపారు. గడిచిన 6 నెలల కాలంలో మూడు ఆప్కో షోరూమ్‌లను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరికొన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు ఆదిత్య బిర్లా గ్రూప్ సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. చేనేత వస్త్రాల



అమ్మకాలకు, నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించేలా టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఆ సంస్థ ఆధ్వర్యంలో కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. త్వరలో 5 శాతం జీఎస్టీ రియింబర్స్‌మెంట్ కు చర్యలు తీసుకుంటామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేయనున్నట్లు తెలిపారు. నూలు కొనుగోలుకు నేతన్నలకు 15 శాతం సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం వర్తింప చేస్తున్నామన్నారు. త్రిఫ్ట్ ఫండ్, వీవర్స్ ముద్ర పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పవర్ లూమ్ యూనిట్లకు 50 శాతం రాయితీ అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఎమ్మిగనూరుతో పాటు రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని, చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్ తో పాటు టెక్స్ టైల్స్ పార్కు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నూతన టెక్స్‌టైల్స్ పాలసీ అమలు చేయబోతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం చేనేత కార్మికుల్లో ఏర్పడిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ సాహూ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో లోటు లేకుండా ప్రణాళికను సిద్ధం చేయండి

### కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎండాకాలంలో తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా తాగునీటిని సరఫరా చేసేటట్టు ప్రణాళికలను సిద్ధం చేస్తూ దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా దుర్గా ఘాట్, గాంధీ మున్సిపల్ హై స్కూల్, బందర్ రోడ్, ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాబోవు ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సరఫరా లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు అధికారులందరూ ముఖ్యంగా స్థానిక కార్పొరేటర్లు, ఏమినిటీల తో మాట్లాడి ఆ ప్రాంతం కి తగ్గట్టు ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. గాంధీ మున్సిపల్ హై స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించారు. అన్నా క్యాంటీన్లను నోడల్ ఆఫీసర్లు అందరూ ప్రతి రోజు నిత్యం పర్యవేక్షిస్తూ ఎటువంటి అసౌకర్యం పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకోవాలి అన్నారు. అన్న క్యాంటీన్లో మరుగుదొడ్ల నిర్వహణ తాగునీటి,వాడుక నీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అన్నారు. దుర్గ ఘాట్ వద్ద ఉన్న టాయిలెట్లను పరిశీలించి, ఆ ప్రదేశంలో నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి గాంధీజీ మున్సిపల్ హై స్కూల్ వాటర్ ట్యాంక్ వద్ద పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించారు నిత్యం నగరంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను అధికారులు పర్యవేక్షిస్తూ పరిశుభ్రంగా ఉంచుతూ నిరంతర పర్యవేక్షణలో ఎటువంటి మరమ్మతులు లేకుండా చూసుకోవాలని అన్నారు. నగరంలో ఉన్న రోడ్లలో పాట్ హోల్స్ వద్ద వేసే ప్యాచ్ వర్క్ లలో నాణ్యత ప్రమాణాలతో వేయాలని రోడ్డుతో సరి సమానంగా ఉండేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, సానిటరీ సూపర్వైజర్లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ - "అక్షరాస్యత ఒక సేవ" పై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమ నిర్వహణ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ విద్యా విధానం 2020 యొక్క మార్గదర్శకాలను అనుసరించి 100% అక్షరాస్యతను సాధించడానికి ఉద్దేశించిన ఉల్లాస్ కార్యక్రమము వయోజన విద్యా శాఖ ఆధ్వర్యములో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమము గురువారం నాడు జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాలు,లో నిర్వహించారు. 2027 నాటికి 100% అక్షరాస్యత అందించాలనే లక్ష్యంలో భాగంగా పొదుపు సంఘాలలోని మహిళలకు, పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు, అంగన్వాడీ ఆయాలు, నైట్ వాచ్మెన్లకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని ఉల్లాస్ డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ హాజీ బేగ్ తెలిపారు. 2024-25 సంవత్సరంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాలలో 8,750 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి కమిటీ సభ్యులైన మండల అభివృద్ధి అధికారులు, సెర్ప్ ఏపిఎంలు, మండల విద్యా శాఖాధికారులు, టి సి ఎస్( టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) వారు రూపొందించిన వీడియోల ద్వారా బోధనాభ్యసన ప్రక్రియ నిర్వహణ గురించి శిక్షణా శిబిరం లో పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు మొహమ్మద్ హాజీబేగ్ ఉల్లాస్ ప్రోగ్రామ్ యొక్క లక్ష్యాలు, "అక్షరాస్యత ఒక సేవ అనే నినాదముతో ఈ సి ఎస్ వారు క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అక్షరాస్యత గురించి రూపొందించిన వీడియో పాఠల ద్వారా అభ్యాసకులకు అవగాహన కల్పించాలని తెలిపినారు. మార్గదర్శకాలను అనుసరించి అక్షర వెలుగు సంక్షిప్త వాచకం వీడియో పాఠాలను అభ్యాసకులకు అనువైన సమయములో నిర్వహించి, భాష గణితంలో సామర్థ్యాలు ఎలా మెరుగుపరచాలో వివరించడం జరిగింది. ఇందులో భాగముగా అందరు మండల అభివృద్ధి అధికారులకు అవసరమైన సంక్షిప్త వాచకాలు, మార్గదర్శిని హాజరు పట్టీలను అందజేసారు.ఈ కార్యక్రమము లో వి. అజయ్ కుమార్, ఏపిఓ శ్రీనివాస్, ఏపిఎం, ఎస్ఈఆర్పి లు పాల్గొన్నారు.



## కంచికచర్ల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..
## ఉచిత మెగా వైద్య శిబిరం

**కంచికచర్ల జనవరి 9 మేజర్ న్యూస్ :** గ్రామీణ పేద ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించడమే ముఖ్య లక్ష్యంగా కంచికచర్ల లైన్స్ క్లబ్ పనిచేస్తుందని డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు పేర్కొన్నారు.స్థానిక ప్రభాకరావు హాస్పిటల్‌లో కంచికచర్ల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్ర హాస్పిటల్, అమరావతి కంటిఆసుపత్రి,దుహిత దంత వైద్యశాల సంయుక్తంగా మెగా వైద్య సేవలు గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా లయన్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు మాట్లాడుతూవైద్య శిబిరానికి డిస్ట్రిక్ట్ లైన్స్ క్లబ్ నాయకులు ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి రావడం జరిగిందన్నారు.గుండె, ఊపిరి తిత్తులు, దంతాలు, కంటికి సంబంధించిన పరీక్షలు ఈ క్యాంపులో నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ మెగా మెడికల్ క్యాంపు కి ఆంధ్ర హాస్పటల్ యాజమాన్యం తమ వంతు సహకారండానికి కృషి చేసిన డాక్టర్ కామినేని అచ్యుతరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెగా వైద్య శిబిర క్యాంపుకి సహకరించిన సహచార మిత్రులందరికీ డాక్టర్ ప్రభాకర్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గోళ్ళ వనజాక్షమ్మకు నివాళులర్పించిన పుర ప్రముఖులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గ్రామ మహిళల అభివృద్ధికి వనజాక్షమ్మ సేవలు మరువలేనివని ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పేర్కొన్నారు. కంకటావ, పరిసర గ్రామ ప్రాంత మహిళల అభివృద్ధి కోసం మాతృసంస్థ అధ్యక్షురాలుగా వనజాక్షమ్మ చేసిన సేవలు మరువలేనివని బాలాజి తెలిపారు. కంకటావ గ్రామం మాజీ సర్పంచ్ గోళ్ళ రామాంజనేయులు, మచిలీపట్నం చలరాస్తా వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ గోళ్ళ సుబ్రమణ్యం మాతృమూర్తి గోళ్ళ వనజాక్షమ్మ దశదిన కార్యక్రమం గురువారం కంకటావ గ్రామంలో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ వనజాక్షమ్మ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు విచ్చేసి ఘనంగా నివాళులర్పించి మహిళలకు అండగా నిలబడి పలు ప్రభుత్వ పథకాలను వారికి అందేలా కృషి చేశారని మహిళల అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని వక్తలు పేర్కొన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వడ్డీ జితేంద్ర, మచిలీపట్నం నగర జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డంరాజు, మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షులు పైడి పాముల గురు ప్రసాద్ గూడూరు మండల వీఆర్వోల మాజీ అధ్యక్షులు లంకిశెట్టి సాయిబాబు మచిలీపట్నం టైలర్స్ అసోసియేషన్ నాయకులు దేవనూరివీరబాబు,ఫ్యాన్సీ గోల్డ్ అధినేత ఆంజనేయులు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెండ్యాల హజరత్ కుమార్తె వివాహ వేడుక

### హాజరైన అహ్మద్ షరీఫ్, కేశినేని నాని, ఫతావుల్లా తదితరులు



**నందిగామ,మేజర్ న్యూస్ :** పెండ్యాల మైనార్టీ నాయకులు హజరత్ కుమార్తె వివాహ వేడుక గురువారం నాడు పెండ్యాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ అడ్వకేట్ కమిటీ చైర్మన్ చైర్మన్, మాజీ శాసనమండలి చైర్మన్ అహ్మద్ షరీఫ్, మాజీ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు (నాని) రాష్ట్ర మైనార్టీ నాయకులు ఫతావుల్లా, ఆషా, ఫిరోజ్, మొహిద్దిన్, కరిముల్లా, ఇమ్రాన్ తదితర నాయకులు హాజరై నూతన జంటలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అచ్చె మియా, నసీర్ పాషా, మునీర్, సాకీబ్, బషీద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి





**గుడివాడ, మేజర్ న్యూస్:** తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిక సంక్రాంతి పండుగని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు – 2025ను కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు గురువారం ఉదయం ప్రారంభించారు. తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదనం ఉట్టిపడేలా స్టేడియంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సోదరీమణులను ప్రోత్సహిస్తూ, చిన్నారులను ఉత్సాహపరిచేలా ముగ్గుల పోటీలు, రంగవల్లులు పోటీలు, కబాడీ లాంటి సాంప్రదాయ క్రీడలతో పాటు 13 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 10వ తేదీ సాయంత్రం నిర్వహించే ముగింపు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించడంతో పాటు, సంబరాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. ముగ్గుల పోటీలు, రంగవల్లుల పోటీలను కమిటీ సభ్యులతో కలిసి యలవర్తి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, లైఫ్ మెంబర్ పిన్నమనేని సాంబశివరావు, కమిటీ సభ్యులు మున్నలూరి లక్ష్మణరావు, ముగ్గుల పోటీల పర్యవేక్షకులు లక్ష్మీ కుమారి, దీవెన, రమ్య, కొలుసు సునీత, నిర్మల, పొట్లూరు రమాదేవి, యార్లగడ్డ సుధారాణి, పెద్ద సంఖ్యలో మహిళలు, స్టేడియం కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పటమట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు





**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలోని పటమట నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందుగానే సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో ఈ కిడ్స్, ప్రైమరీ క్లాస్‌ల విద్యార్థులకు హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏజీఎం మురళీ కిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ గురించి వివరించారు. రైతు తను పండించినటువంటి మొట్టమొదటి పంటకు ఇచ్చే తొలి సంతోషకానుక ఈ సంక్రాంతి అని, మన సంస్కృతిని తెలియజేసే పండుగ అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు రైతు యొక్క గొప్పతనాన్ని పండగ యొక్క ప్రాముఖ్యతను భారత దేశ సాంస్కృతిక మేలవింపును తెలియజేస్తాయన్నారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకి రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కిడ్స్ కో– ఆర్డినేటర్ చందన, ఇచాంప్స్ కో – ఆర్డినేటర్ జహూర్ ఫాతిమా, క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## చర్చి శంకుస్థాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** మండలంలోని పెద్దవరం గ్రామంలో గురువారం నాడు దైవ సేవకులు,సంఘస్తులు, క్రైస్తవ సోదర సోదరీమణులు, కూటమి నేతలతో కలసి సిఎస్ఐ చర్చి శంకుస్థాపన (భూమి పూజ) కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సిహెచ్ వి వి ఎస్ బాపిరాజు ఆకస్మిక తనిఖీలలో భాగంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్, 45 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, డివిజన్ శానిటేషన్, సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్ లో ప్రజలతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ డివిజన్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మచిలీపట్నం నగర కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్, సిహెచ్ వి వి ఎస్ బాపిరాజు మాట్లాడుతూ. 45వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పి. వి. ఫణి కుమార్ సూచనల మేరకు అప్రోచ్లు, కల్వర్టర్లు, డ్రైనేజీ సమస్య ఉందని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తాము అన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా మంచినీటి పైపులైన్ల లీకేజీ సమస్య ను గుర్తించామని మంచినీటి లీకేజీ ల సమస్యను వెంటనే పరిష్కరించమని క్రింది స్థాయి అధికారులకు సూచించాము అన్నారు. డివిజన్ ప్రజలు వివిధ రకాల సమస్యలను దృష్టికి తీసుకువచ్చారని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించమని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, సచివాలయ సిబ్బంది ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు అని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ..గత వైసిపి పాలకుల నిర్లక్ష్యంతో మచిలీపట్నంలో శానిటేషన్ పూర్తిగా స్తంభించిపోయిందని, శానిటేషన్‌కు అవసరమైన పరికరాలను మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి వైసీపీ



నాయకులు అందించడంలో కూడా పూర్తిగా విఫలమయ్యారు అని విమర్శించారు. సుమారు 40 లక్షల విలువచేసే జెసిబిని,తడి చెత్త, పొడి చెత్త ఎత్తుకునే డబ్బాలు, ఇళ్ల వద్దకు వచ్చి చెత్త తీసుకునేందుకు తోపుడు బళ్ళు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీ ద్వారా కొనుగోలు చేసి శానిటేషన్ కి నగరంలో ఇబ్బంది లేకుండా మంత్రి కొల్లు రవీంద్ర చూస్తున్నారు అన్నారు. గత వైసిపి ఐదు సంవత్సరాల పరిపాలనలో నగరంలో పెద్దపెద్ద డ్రైనేజీల పూడిక తీత పనులు కూడా చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద పెద్ద డ్రైన్లు పూడికతీత పనులను కూడా ఆగమేఘాల మీద మంత్రి కొల్లు రవీంద్ర చేయించారు అన్నారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, పి. వి. ఫణి కుమార్, డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గంజాల రవికుమార్, డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, కొనకళ్ళ భాను తో పాటుగా మూడో డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, చిన్నం సురేష్, 50 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, పడమట నాగరాజు, 45వ డివిజన్ శానిటేషన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి అమిత్ షాను పదవి నుండి తొలగించాలి



**పామర్రు జనవరి 9 మేజర్ న్యూస్:** బాబా సాహెబ్ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని., ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ కోఆర్డినేట్ ముప్పు మోహన్ రావు పేర్కొన్నారు. గురువారం పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవమానించడం అంటే ఈ దేశంలో ఉన్న 140 కోట్ల మంది భారతీయులను అవమానించినట్లేనని 140 కోట్ల మంది భారతీయులను, వారి మనోభావాల్ని దెబ్బతీసిన అమిత్ షా ని దేశద్రోహిగా పరిగణించి తక్షణమే కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాక పార్లమెంట్ సభ్యత్వం కూడా బర్తరఫ్ చేసి దేశ బహిష్కరణ చేయవలసినదిగా కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. అమిత్ షా మాట్లాడిన మాటలు కేవలం ఆయనవే కావని, ఎన్డీఏ ప్రభుత్వం, బిజెపి పార్టీ వైఖరి గా దేశ ప్రజలందరూ భావించి ఈ దేశంలో సంక్షేమం, అభివృద్ధి,, శాంతిభద్రతలు సమగ్రంగా ఉండాలంటే ఈ దేశంలో మతతత్వ పార్టీ అయినటువంటి బిజెపిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అలాగే రాజ్యాంగ వాదులు, ప్రజా సంఘాలు, మానవ హక్కుల కోసం పని చేసే ప్రతి ఒక్కరూ మతోన్మాదవాదుల పట్ల ఇదే వైఖరిని కొనసాగిస్తూ దేశం నుండి బహిష్కరించి దేశాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి భారతీయుడు బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భుజంగ నాయక్, పమిడిముక్కల మండల అధ్యక్షులు కాగిత సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు నల్లూరి పాపారావు(నాని ), మొవ్వ మండలం అధ్యక్షులు పిట్టు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మద్దాలి నాగభూషణం, తోట్ల వల్లూరు మండలం ఉపాధ్యక్షులు లంకేశ్వరరావు లతో పాటు పామర్రు నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కపిలేశ్వరపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీలో తీర్మానం చేయాలని కోరుతూ కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు కూడా వినతిపత్రాలను మోహన్ రావు అందజేశారు.

## శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు



**పెడన,మేజర్ న్యూస్:** పట్టణంలో వేంచేసి యున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవ కార్యక్రమాలు నేటి నుండి అనగా శుక్రవారం నుండి ఆదివారం వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ శుక్రవారం ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుండి స్వామివార్ల ఉత్తర ద్వార దర్శనం, అర్చన, తీర్థ ప్రసాదాల, వియోగం, అదే రోజు సాయంత్రం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవము, యజమాన దంపతులు వేద ఆశీర్వచనం, నీరాజనం,తీర్థ ప్రసాదాల, విని యోగం జరుగునని తెలిపారు. మురసటి రోజు శనివారం ఉదయం 8:30 నుండి మహా సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, నీరాజనం, తీర్థప్రసాద వియోగం, సహస్ర దీపాలంకరణ, అర్చన, చతుర్వేద పారాయణం, ఉండునని, ఆదివారం శ్రీ స్వామివారి గ్రామోత్సవము జరుగునని కావున ఈ కార్యక్రమాలన్నిటిలోనూ పట్టణ, చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ బళ్ళ ప్రసాదు, చందన నారాయణరావు, బొడ్డు దీక్షానందుడు, ఊటుకూరి నాగ సూర్యప్రకాశరావు, కట్ట హేమ సుందర మూర్తి, ఇమ్మడి నాగ పోతరావు, కొత్త నవీన్ కుమార్,భూసం అగస్త్యేశ్వరరావు, జక్కుల బసవేశ్వర రావు, దివి పైడిరాజు, తదితరులు ఉన్నారు.

## కండరాల వ్యాధిగ్రస్తునికి షిఫ్టింగ్ వీల్ చైర్ బహూకరణ



**గన్నవరం, జనవరి 9, మేజర్ న్యూస్ :** కండరాల వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న ఆత్మకూరు కు చెందిన పాలపర్తి ప్రమోద్ కు గన్నవరం మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ షిఫ్టింగ్ వీల్ చైర్ అందజేసింది. ప్రమోద్ విజ్ఞాపన మేరకు మానవతా సంస్థ రూ.40 వేల విలువైన వీల్ చైర్ ను గురువారం అందజేసింది. కంప్యూటర్ జాబ్ వర్క్ చేసుకునే ప్రమోద్ అనేక సంవత్సరాలుగా కండరాల వ్యాధితో మంచానికి పరిమితమయ్యాడు. ప్రస్తుతం వీల్ చైర్ అందించడంతో తనకు చాలా వరకు ఇబ్బంది తప్పిందని, తన పని సాఫీగా సాగేందుకు వీల్ చైర్ తోడ్పడుతుందని సంతోషం వ్యక్తం చేస్తూ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మానవతా సంస్థ అధ్యక్షులు మదుపల్లి బాల కృష్ణమూర్తి మాట్లాడుతూ... తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఆయా పాఠశాలలకు వెళ్లి రూ. 75 వేల నగదు బహుమతులను ప్రతిభా పురస్కారాలు గా అందజేశామని తెలిపారు. అలాగే 10 వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ గన్నవరం శాఖ ప్రధాన కార్యదర్శి కర్రా వర ప్రసాద్, సహాయ కార్యదర్శి వీసం ప్రసాదరావు, సభ్యులు వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి తిరిగి సీఎం కావడం ఖాయం



**పెనుగంచిప్రోలు జనవరి 9 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని బుధవారం వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాజీ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి దంపతులు గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి వేల్పుల దంపతులను అత్యంత ఆప్యాయంగా ఇరువురిని దగ్గరకు తీసుకొని వారితో చేతిలో చేయి వేసుకొని తన ఆశీర్వాదాలు తెలిపారు. తన ఆశీస్సులు ఎల్లప్పుడూ మీకు నిండుగా ఉంటాయని, మీకు అండగా నేనున్నానని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని పూర్తి భరోసా ఇచ్చారు అని వారు తెలిపారు.ఈ సందర్భంగా వేల్పుల రవికుమార్- పద్మ కుమారి దంపతులు తమ పట్ల జగన్మోహన్ రెడ్డి చూపిన ప్రేమాభిమానాలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేంతవరకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చినా, తాము భరిస్తామని స్పష్టం చేశారు. మీరు ముఖ్యమంత్రి కావడం తప్ప మాకు వేరే కోరిక ఆలోచనలు కూడా లేవని వారు జగన్మోహన్ రెడ్డికి వివరించారు. రాష్ట్రంలో నిరుపేద వర్గాలు మొత్తం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వారు తెలిపారు వైయస్ జగన్మోహన్ రెడ్డిని రవికుమార్ పద్మ కుమారి దంపతులు ఘనంగా సన్మానించి నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు అని వారు పత్రిక ముఖంగా తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**పామర్రు జనవరి 9 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పామర్రు లోని సాయిదుర్గా నగర్ లో గురువారం జరిగిన దున్నా నాగేశ్వరరావు కుమారుని వివాహ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా నిత్య సహాయ మాత ప్రతిష్ట కార్యక్రమం



**చందర్లపాడు, జనవరి 9, మేజర్ న్యూస్:** మండలంలోని పాత బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో గురువారం నిత్య సహాయ మాత ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో దైవ సేవకులు, క్రైస్తవ సోదర సోదరీమణులు, కూటమి నేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.అనంతరం గ్రామంలో నోట్ బుక్స్, పెన్నులను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**పామర్రు జనవరి 9 మేజర్ న్యూస్ :** పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు నియోజవర్గం లోని వివిధ గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పామర్రు టౌన్ లోని కోటిరెడ్డి పేటలో అనిత రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఉండ్రపూడి గ్రామంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుడు మండపాక శంకర్ బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి పెద్ద సంఖ్యలో గ్రామస్తులను పార్టీ సభ్యులుగా నమోదు చేస్తున్నారు. మరో మూడు రోజులు మాత్రమే పార్టీ సభ్యత్వానికి సమయం ఉండటంతో ఆయా గ్రామాల్లో మండల, గ్రామస్థాయి నాయకులు ప్రత్యేక పర్యవేక్షణతో కార్యకర్తల సహకారంతో సభ్యత్వ నమోదును చేస్తున్నారు.

## పరిశుద్ధ నూతన ప్రార్థన మందిరం శంకుస్థాపన



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దవరం గ్రామంలో పరిశుద్ధ అంద్రేయా సీఎస్ఐ దేవాలయం శంకుస్థాపన వేడుక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో బిషప్ తంటేపూడి జార్జి కోర్నలియస్ బిషప్ దాసరి జాషువా కుమారి, సంఘ కాపరి విజయభాస్కర్,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగునూరి కొండారెడ్డి సంఘపెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యం, టీటీడీ బోర్డు అసమర్థత వల్లే ప్రమాదం

**గుడివాడ, మేజర్ న్యూస్:** తిరుపతి ఘటనలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ భయ్యా వారి వీధిలోని ఆయన కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి గురువారం మీడియాతో మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యం, టీటీడీ బోర్డు అసమర్థత వల్లే తొక్కిసలాట ప్రమాదమని ఆరోపించారు. ప్రపంచంలోనే హిందువులకు అత్యంత పవిత్రమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో ఇంతటి దారుణ ఘటన జరగడం బాధాకరమన్నారు. దేవాదాయ శాఖ మంత్రి, టిటిడి పాలక సభ్యులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల టిటిడి చరిత్రలో ఎన్నడూ ఇంతటి దారుణ దుర్ఘటన జరగలేదని, ప్రభుత్వ తప్పిదానికి అధికారులపై నెపం నెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశంలో పేకాడుతున్న వారు అరెస్టు

### వారివద్ద నుంచి 5400 నగదు స్వాధీనం



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ చెంచుపేటలో బహిరంగ ప్రదేశం లో పేకాట ఆడుతున్న వారిని గుడివాడ 1టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేసారు. వారివద్ద నుంచి రూ. 5400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు 1టౌన్ ఇన్స్పెక్టర్ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.



## పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య

**చందర్లపాడు, జనవరి 9, మేజర్ న్యూస్:** మండలం లోని తుర్లపాడు( కొత్త కంచల) గ్రామానికి చెందిన రైతు కోమ్ముకూరి గాబ్రేలూ అప్పుల బాధ తాళలేక పంట పోలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 7తేదిన పురుగు మందు సేవిండం తో నందిగామ ప్రభుత్వ హాస్పటల్ చికిత్స అనంతరం విజయవాడ కు తరలించారు. చికిత్స పొందుతూ 8 తేది న మృతి చెందాడు. పోలం కౌలుకు తీసుకున్న గ్రాబ్రేలు పత్తి,మిర్చి పంట వేశాడు. పలువురు గాబ్రియేలు మృత దేహానికి నివాళులర్పించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచు కొని వాటిని సాధిం చాలని పెడన ని యోజకవర్గం ఎమ్మె ల్యే కృష్ణ ప్రసాద్ ఆకాంక్షించారు. సంక్రాంతి సంబరా ల్లో భాగంగా గురువారం కొమ్మారెడ్డి స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బొమ్మలకొలువును ప్రారంభించారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసే ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషం ఉందని ఇటువంటి కార్య క్రమాలు నిర్వహిస్తున్న కొమ్మారెడ్డి స్కూల్ యాజమాన్యాన్ని అభినందిం చారు. ఈ పండుగ సందర్భంగా విద్యార్థులలో 8 నుండి 10వ తరగతులు జూనియర్స్ 6, 7 తరగతుల విభాగాలలో, టీచర్స్ కూడా రంగవల్లుల పోటీ లను నిర్వహించి గెలుపొందిన వారికి తెలుగు అమ్మాయి, తెలుగుఅబ్బాయి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ స్కూల్ సెక్రటరీ, కరస్పరండెంట్ కె.ఎస్.వి.జి శోభ యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి హారణి హె.చ్ఎం. ఎన్. శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హరిదాసు,కొమ్మదాసు, బుడబ క్కల వారు, సోదమ్మ, గంగిరెద్దుల ఆట ప్రత్యేకంగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు చేసిన కర్ర సాము విన్యాసాలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.

## సత్తెమ్మ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్ :** మండలం లోని అం బారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానంలో హుం డీలను తెరిచి లెక్కిం చగా 2 నెలల గాను రూ. 6,19,475/- వచ్చినట్టు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమం నందిగామ డివిజన్ ఇన్స్పెక్టర్ జి.పవన్ కళ్యాణ్, శ్రీ సత్యసాయి సేవా దళ్ సభ్యులు ఆధ్వర్యంలో, ఆలయ కార్యనిర్వహణ అధికారి గెల్లి,హరిగోపీనాథ్ బాబు, ఆలయ మాజీ చైర్మన్లు, గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు.

## గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందజేత



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్ :** పట్టణంలోని గవర్న మెంట్ హాస్పిటల్లో ప్రతి నెల 9వ తారీ ఖున గర్భిణీ స్త్రీలకు పమ్సా ప్రోగ్రాం జరుగుతుంది. ఈ ప్రోగ్రాం ద్వారా గర్భిణీ స్త్రీలకు ఆహారం, పౌష్టికాహార పంపిణీ కార్యక్రమమును అందించె ఈ కార్యక్రమం ను హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు ప్రారంభించారు ప్రారంభించారు. నందిగామ ఆర్డిఓ కే బాలకృష్ణ సౌజన్యంతో గురువారం నాడు గర్భిణీ స్త్రీలకు భోజనం, పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరావు,మెడికల్ సూపర్డెంట్ సత్యనారాయణ గైనకాలజిస్ట్ సీతారావమ్మ మాధవి లత మేడం, హెడ్ నర్సు సూర్యవతి తో గర్భిణీ స్త్రీలకు ఆహారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం చేశారు.

# తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం



**వైకుంఠ దర్శనం కోరితే వైకుంఠానికి పంపుతారా.....**

**మృతి చెందిన కుటుంబానికి కోటి రూపాయలు తీవ్రంగా గాయపడిన బాధితులకు 50 లక్షలు ఉద్యోగం ప్రభుత్వం తక్షణ సాయం అందించాలి......**

**వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు**

**జగ్గయ్యపేట జనవరి 9 మేజర్ న్యూస్ :** పట్టణం లో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ. తిరుపతిలో జరిగిన ఈ ఘటన తీవ్ర విచారకరం. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం భారీ సంఖ్యలో భక్తులు తాకిడి చేయడంతో తొక్కిసలాట జరిగి ఇప్పటికీ ఆరుగురు నుంచి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు, మరి కొంతమంది తీవ్ర గాయాల తోటి చికిత్స పొందుతున్నారు. టీటీడీ ఆలయ ఈవో, చైర్మన్, అధికారులు తప్పిదం వల్లే ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఆవరణంలో ఎక్కువ సమయం ఉంచడం వల్ల భక్తుల అధిక రద్దీ కారణంగా తొక్కిసలాట చోటుచేసుకుంది అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి అని, సర్వ దర్శనం టోకెన్ ల కోసం సాయంత్రం నుంచే భక్తులు నిలబెట్టి ఉంచి ఒకేసారి గేటు తెరవడం వల్లే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించింది ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలి అని కోరారు. గోవింద నామాలు ప్రతి ధ్వనులు వినిపించాల్సిన చోట మృత్యు ఘోష వినిపించిందని ఈ ఘటన జరగటానికి కారణమైన వ్యక్తుల్ని, అధికారుల్ని కఠినంగా శిక్షించాలి అని అన్నారు. ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఫిరోజ్ ఖాన్, మాజీ టౌన్ పార్టీ అధ్యక్షులు చౌడవరపు జగదీష్, ఎస్సీ సెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, ఎస్టీ సెల్ నాయకులు బద్దు నాయక్, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన డైరెక్టర్ నంబూరి రవి, మండలం పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, ఉపేందర్ రెడ్డి, వినోద్ కుమార్, గోగుల వెంకయ్య, గొట్టిపాల సురేష్, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలకు నిలయం మన భారతదేశం

**సామాజిక వేత్త,ప్రముఖ అడ్వకేట్ సూరి పవన్ కుమార్,**



**గన్నవరం, జనవరి 9, మేజర్ న్యూస్ :** సంప్రదాయాలకు నిల యం మన భారత దేశమని సామాజిక వేత్త, ప్రముఖ అడ్వకే ట్, శ్రీ ప్రజ్ఞ హైస్కూల్ అధినేత సూరి పవన్ కుమార్ అన్నారు. గన్నవరం మండలం దావాజీగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రం లో గురువారం పవన్ కుమార్, శైలజ, రజిత వెంకట్ లు జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలు చేసారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ ఆచారాలకు, సంస్కృతికి, సంప్రదాయాలను మన దేశం ఎంతో ప్రసిద్ధి అని అది మన పూర్వికులు ఇచ్చిన పెద్ద ఆస్తి అని ఆయన అన్నారు. గన్నవరం ప్రాంతంలో దివ్యాంగుల కొరకు స్పందన మానసిక వికాస కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా, వైద్య, రవాణా, భోజన సౌకర్యాలు ఏర్పాటు చెయ్యడం ఎంతో అభినందనీయమని పవన్ కుమార్ అన్నారు. అనంతరం బోగీమంటలు, సంక్రాంతి ముగ్గులు వేసి పిల్లలకు బోగి పండ్లు పోశారు. ఈ కార్యక్రమం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్, శ్రీపజ్ఞ ప్రిన్సిపాల్ కోటంరాజు నాగ శైలజ రాజ రాజేశ్వరి, అడ్వకేట్ రంజిత్ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ లు స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఫాతిమా జయంతి వేడుకలు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** ఏ కొండూరు విద్యా శాఖ కార్యాల యంలో గురు వారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆధు నిక భారతదేశ తొలి ముస్లిం మ హిళ ఉపాధ్యా యునిగా చరిత్రలో నిలిచిన షేక్ ఫాతిమా ఆదర్శమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్టియు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బి విశ్వభారతి మాట్లాడుతూ చదువుల తల్లి ఫాతిమా ఎన్ని ఆటంకాలు అవమానాలు ఎదురైన బాలిక, స్త్రీ విద్య వ్యాప్తికై తన లక్ష్య సాధన వైపు ముందడుగు వేసిన స్ఫూర్తి ప్రదాత అన్నారు. పూలే దంపతులతో పాటు సామాజిక సేవకు నడుం కట్టిన మహనీయురాలని నేటి ఉపాధ్యాయులు అందరికీ ఫాతిమా ఆదర్శప్రాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు గౌరవ అధ్యక్షులు కేవీ మంగమ్మ, ఎంఈఓ ఎం రాజశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో సంక్రాంతి సంబరాల్లో భా గంగా గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలు ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. రకరకాల రంగులతో అత్యంత అందంగా ముగ్గులు వేసినారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీలా పర్యవేక్షణలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలను నిర్ణయించినారు. గెలుపొందిన వారికి బహుమతులతో ప్రోత్సహించినారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ సాబు, డైరెక్టర్ సాబూజాన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## ఏకత్వా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు




**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** తెలుగు ప్రజలు ఎంతో ఇష్టంగా జరుపుకునే పండుగ ఏకత్వ పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ అమరనేని మనోజ్ అన్నారు. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వా పాఠశా లలో సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు చిన్నారులకు భోగి పళ్ళు పోసి మురిసి పోయారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగి రాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్, మున్సిపల్ నాగ సూర్య వతి మాట్లాడుతూ మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు బోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది. నందిగామ నియోజకవర్గ స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలను ఘనత నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలుగు ప్రజలందరూ ఎంతో సంతోషంగా జరుపుకునే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్ర తీయేటా ప్రజలలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇచ్చే ఇలాంటి సృజనాత్మక కార్య క్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో మొదటి విజేతకు రూ. 10116 లు, రెండవ విజేతకు రూ. 5116లు, మూడవ విజేతకు రూ. 3116లు తర్వా త వరుసగా గెలుపొందిన 10 మంది మహిళలకు రూ. 1116ల చొప్పున బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఏకత్వా చైర్మన్ అమరనేని రమేష్ బాబు, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర, డీన్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇవి ముమ్మాటికి ప్రభుత్వ అసమర్ధ పాలన హత్యలే...



## బిఎస్పి నందిగామ నియోజకవర్గ ఇన్చార్జ్ బర్రె ఉదయ్ కిరణ్ డిమాండ్

**కంచికచర్ల జనవరి 9 మేజర్ న్యూస్ :** తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన దుర్ఘటన చాలా బాధాకరమని నందిగామ నియోజ కవర్గ బి ఎస్ పి ఇంచార్జ్, కంచికచర్ల ఎంపిటిసి సభ్యులు బర్రె ఉదయ్ కిరణ్ విషాదం వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దుర్ఘటనలో మృతులు బలవటానికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత రాజకీయాల ద్వారా ప్రజల మధ్య వైశ్యామ్యాలు సృష్టించడంలో ఉన్న శ్రద్ధ భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో పెట్టలేక పోయారని ఎద్దేవా చేశారు.ప్రపంచం లో ఉన్న హైందవ దేవాలయాలలో తిరుపతిలోని తిరుమల దేవస్థానానికి చాలా ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఏటా కొన్ని కోట్ల మంది దైవ దర్శనం కోసం ఖండాంతరాలు దాటి ఇక్కడికి ఎంతో నమ్మకంతో తమ మొక్కలు చెల్లించడానికి తరలివస్తుంటారని తెలిపారు.కొన్ని వేల కోట్లలో ఆదాయం వస్తున్న ప్రసిద్ధిగాంచిన దేవాలయంలో తొక్కిసలాట సంఘటన జరగటం చాలా విచారకరమన్నారు. కనీస సదుపాయాలు,సౌకర్యాలు,భద్రత లేకుండా వ్యవహరించడం టిటిడి బోర్డు యొక్క బాధ్యతారాహిత్యం అని అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు తన యొక్క ప్రగాఢ సంతాపం తెలియజేశారు. చనిపోయిన ప్రతి ఒక్కరికి కోటి రూపాయల చొప్పున టీటీడీ బోర్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే క్షతగాత్రులకు వారి యొక్క తీవ్రతను బట్టి నష్టపరిహారం చెల్లించాలన్నారు.ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ తిరుమల తిరుపతి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. టికెట్లు అమ్ముకోవడంలో, వీఐపీ దర్శనం టికెట్లు విక్రయించడంలో పెట్టిన శ్రద్ధ వైకుంఠ ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులను నియంత్రించి అవాంఛనీయ సంఘటనలను నిలువరించడంలోటీటీడీ బోర్డు పూర్తిగా విఫలమైందన్నారు.ఇది ముమ్మాటికి మాయా కూటమి ప్రభుత్వ అసమర్ధ పాలన హత్యలేనని దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఉదయ్ ఉద్ఘాటించారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడు రాజీనామా చేయాలన్నారు.ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత రాజకీయాల ద్వారా ప్రజల మధ్య వైరుధ్యాలను, వైషమ్యాలను సృష్టించి సోదర భావాన్ని దెబ్బతీసే స్వార్థపూరిత రాజకీయ పార్టీల గురించి తెలుసుకొని ప్రజలు ఇకనైనా కళ్ళు తెరవాలని కోరారు. ఇప్పటికైనా అమాయక భక్తుల పక్షాన ప్రతి ఒక్కరూ నిలబడాలని తిరుమల తిరుపతి దేవస్థానం లో మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేయాలని ఉదయ్ కిరణ్ విజ్ఞప్తి చేశారు. ముందు ముందు ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని ఉదయ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి క్యాపిటల్ ఛైర్మన్‌గా రంగనాధ్

**గుడివాడ, మేజర్ న్యూస్:** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) అమరావతి క్యాపిటల్ సెంటర్ ఛైర్మన్ గా గుడివాడ అమ్మకన్ ష్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాధ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రకటించారు. విజయవాడ వేదికగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అమరావతి క్యాపిటల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్ సత్యన్నారాయణ, కోశాధికారిగా కెపి కిరణ్, ఉపాధ్యక్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ మాటూరి రంగనాధ్ మాట్లాడుతూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పట్ల సానుకూలంగా ఉండటం పరిశ్రమకు కలిసి వచ్చే అంశంగా మారిందన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతుల మంజూరు ప్రక్రియ వేగవంతం అయితే భవన నిర్మాతలకు మరింత మేలు కల్గుతుందన్నారు. ఇప్పటికీ కొన్ని సమస్యలు స్థిరాస్తి రంగాన్ని వెంటాడుతున్నాయని, నారెడ్కో, క్రెడాయ్ వంటి ఇతర అసోసియేషన్లతో కలిసి వీటి పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు, మంత్రి నారాయణ ఇప్పటికే స్థిరాస్తి సమస్యల పరిష్కారం కోసం ఎంతో చేస్తున్నారన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా నూతన సంవత్సరం డైరీని ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి



మార్గనిర్దేశకత్వంలో అమరావతి నిర్మాణం ప్రారంభమైందన్నారు. ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్, అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి. పంకజ్ రెడ్డి, నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి. చక్రధర్, బాయ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు వల్లభనేని వెంకటేశ్వరరావు, విజయవాడ క్రెడాయ్ అధ్యక్షుడు డి. రాంబాబు, రమేష్, సందీపని, బాలాజీ, ప్రభు, సందీపని తదితరులు పాల్గొన్నారు.



## పండుగ సాంప్రదాయాలను ఆచరించాలి

**కృత్తివెన్ను జనవరి 9 మేజర్ న్యూస్.** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెంలో గురు వారం సంక్రాంతి సంబరాలను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కొప్పినీడి సూర్య ప్రకాష్ ఆ ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి నులు రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మ లతో, ముత్యాల ముగ్గులు వేసి పం డుగ వా తావరణంలో ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యా యులు సంక్రాంతి పండుగ విశిష్ట తను విద్యా ర్థులకు తెలియజేశారు. ముగ్గుల పోటీలలో వి జేతలైన విద్యార్థులకు బహుమ తులు ప్రదా నం చేశారు. పర్యవేక్షకులుగా సా నా ఏడు కొండలు, ఉండి పురుషోత్తం, సత్య నారా యణ వ్యవహరించారు. ఈ కార్య క్ర మంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సేవలను యధావిధిగా అమలు చేయాలి

**జగ్గయ్యపేట: జనవరి 9 మేజర్ న్యూస్ :** పేదవాడి ఆరోగ్యం పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్న కూటమి ప్రభుత్వం పై జగ్గయ్యపేట వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవలను యధావిధిగా అమలు చేయాలని ఆయన కోరారు.ఆరోగ్యశ్రీ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు ప్రజల పట్ల మానవతా దృక్పథం పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతుంటే ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.నేడు ఆరోగ్యశ్రీ పరిస్థితి ఏమిటంటే అనారోగ్యంతో హాస్పిటల్ కు వెళితే అడ్మిట్ చేసుకుంటారో లేదో తెలీదు. వెళ్లిన ఆసుపత్రిలో అవసరమైన డిసీజ్ కవరేజ్ ఉంటుందో లేదో తెలియదు కొత్త హైబ్రిడ్ విధానం ద్వారా రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారు అని అన్నారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత కాదు అని ఈ ప్రభుత్వం చెబుతోంది.ఈ ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ మోడల్ ఫెయిల్యూర్ మోడల్. కొన్ని ప్రభుత్వాలు ఈ విధానాన్ని రద్దు చేసుకున్నాయి.ఈ విధానాన్ని పూర్తిగా వైఎస్ఆర్ పార్టీ తరఫున మేము వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఆరోగ్య శ్రీ ని ప్రారంభించారు దాన్ని జగన్ వచ్చాక మరింత బలోపేతం చేశారు రూ. 5 లక్షల ఆరోగ్యశ్రీ




పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడమే కాక, ప్రొసీజర్స్ ను,నెట్వర్క్ హాస్పిటల్స్ ను పెంచిన ఘనత వైయస్ జగన్ది అని తెలిపారు.పేదవాడి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని భావించిన పాలకుడు వైయస్ జగన్. నేడు నెట్వర్క్ ఆసుపత్రులు సేవలు నిలిపివేసే దుస్థితికి తెచ్చింది కూటమి ప్రభుత్వం అని పేర్కొన్నారు.చంద్రబాబు బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ అని ఎన్నికల్లో మీరు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక మీర్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ఇచ్చిన హామీలను ఎలాగూ ఎగరగొడుతున్నారు. మేం ఇచ్చిన పథకాలనూ రద్దుచేస్తున్నారు.ఇప్పుడు కోటిన్నర కుటుంబాల ఆరోగ్యానికి ష్యూరిటీ లేదు కదా, ఉన్న గ్యారంటీని తీసేశారు. ప్రజలకు నష్టంచేసే మీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. వెంటనే ఆరోగ్యశ్రీని యథాతథంగా ఉంచి అమలు చేయాలని ప్రజల తరఫున డిమాండ్ చేశారు.

## వరిగడ్డి వాము దగ్ధం రైతు ఆవేదన



**వత్సవాయి,జనవరి 9, మేజర్ న్యూస్ :** మం డలంలో గోపినేనిపాలెం గ్రామంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంకు రోడ్ మీద క టపాస్లు కాలుస్తుం డటంతో దురదృష్టవ శాత్తు వరిగడ్డి వాము మీద కప్పిన టార్పలిన్ పట్టా మీద నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడం జరిగింది. ఒక్క సారే వరిగడ్డి వాము అంతటకి మంటలు కమ్మేయడంతో స్థానికులు సమీప ఇళ్ల మోటర్ నీటి ద్వారా మంటలు నియంత్రించుటకు ప్రయత్నం చేయడం జరిగింది.సుమారుగా ఆ రైతుకు 50000 రూపాయలు నష్టం వాటిల్లందని స్థానికులు అంచనా వేయడం జరిగింది. అగ్నిమాపక యంత్రం ద్వారామం టను 3 గంటలు శ్రమించి అర్పిన అగ్నిమాపక సిబ్బంది. వరిగడ్డి వాము కాలిపోవడం వల్ల, పశువులు మేతకు కూడా పనికి రాదని ఆ రైతు ఆవేదన తో కన్నీరు పర్యాంతమైనారు.పశువులకు గ్రాసం ఎక్కడ తీసుకురావలేనని ఆయన ఆవేదన చెందారు.గ్రామ ప్రజలు ఓదార్చడం జరిగింది.

## శివరామ బ్రహ్మంకు నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజా



**పామర్రు జనవరి 9 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మం డలం కపిలేశ్వరపురం గ్రామం లో గురువారం జరిగిన సీని యర్ నాయకులు తాతినేని శివరామ బ్రహ్మం ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరామ బ్రహ్మం చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లిపర బాబి తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించండి




**పామర్రు జనవరి 9 మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పట్ల స్పందించడం ద్వారా అధికారులు తమ బాధ్యతలు సక్రమంగా ని ర్వహించాలని పా మర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. గురువారం పెద పా రుపూడి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే కుమార్ రాజా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ప్రజల నుండి ఎటువంటి సమ స్యలు వచ్చినా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటిని పరిష్కరిం చాలని సూచించారు. గ్రామాల్లో ప్రస్తుతం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణం జరుగుతోందని, రానున్న కాలంలో మరి న్ని రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మార్చి తరువాత పక్కా డ్రైన్ ల నిర్మాణానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతి నిధులు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి తమ సేవలను అందించాల్సిన అవ సరం ఉందన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా అందరం కలిసిక ట్టుగా వాటి పరిష్కారానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎండిఓ సీతా మహాలక్ష్మి, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీ టీసీ సభ్యులు, పలువురు గ్రామ సర్పంచులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సూరపనేని సత్యనారాయణ, కలపాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మందుల షాపును తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్



**రెడ్డిగూడెం జనవరి 9, మేజర్ న్యూస్:** ఫార్మసిస్టు లేకుండా మెడికల్ షాపుల్లో మందులు అమ్మితే చర్యలు తీసుకుం టామని. డ్రగ్ ఇన్స్పెక్టర్ కే. సురేష్ కు మార్ అన్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా ఆదేశాల మేరకు రెవెన్యూ, డ్రగ్ అధి కారులు సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రెడ్డిగూడెం లోని పి హెచ్ సి సెంటర్ ను, ప్రైవేట్ మెడికల్ దుకాణాన్ని గురువారం తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా ప్రైవేట్ దుకాణంలో ఫార్మసిస్ట్ లేకుండా మందులు అమ్మడాన్నీ గుర్తిం చామని డ్రగ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మ సిస్టు లేకుండా మందులు అమ్మ రాదని. అలా అమ్మిన వారిపై చర్యలు తీసు కుంటామని తెలిపారు..ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జే సుశీల దేవి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్వో జానీ, పాల్గొన్నారు

# కాకతీయ సిబిఎస్ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు










**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని రామలింగేశ్వర నగర్ కాకతీయ సిబిఎస్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ కాపా కార్తీక్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి.పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాచీన సాంప్రదాయ పిండి వంటలు పండగ విశిష్టత బొమ్మలకొలువు సోదెమ్మ ఆంధ్ర వైభవ ప్రదర్శన ప్రాచీన సాంప్రదాయ ఆటలు పెళ్లి పందిరి మొదలగు మొదలగు స్టాల్స్ ని ఏర్పాటు చేశారు. ఈ సంబరాలకు నందిగామ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కాకతీయ సంక్రాంతి సంబరాలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సౌమ్య మాట్లాడుతూ పల్లెటూరు వాతావరణాన్ని ప్రాచీన సంప్రదాయాన్ని పిల్లలకు కళ్ళకు కట్టినట్టు తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఇలాంటి ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులలో తెలుగు పండగ యొక్క విశిష్టతను తెలుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి యాజమాన్యానికి విద్యార్థులకు ఉపాధ్యాయులకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ రవీందర్నాథ్, భారతి, కాకతీయ సిబిఎస్ డైరెక్టర్ కార్తికేయ సుష్మ, ప్రిన్సిపల్ సత్యమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# మహిత పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి




**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక మహిత పబ్లిక్ స్కూల్‌లో సంక్రాతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, గాలి పటాలతో కోలాహలంగా పండుగ చేసుకున్నారు. పిండి వంటలను విద్యార్థులకు అందజేశారు. చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ వరలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఉద్దేశంతో కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం ముఖ్య అతిధిగా పాల్గొన్న చైర్మన్ జె.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయలు గురించి విద్యార్థి దశ నుంచే తెలియజేయాలనే స్కూల్స్ లో ఈ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అకాడమిక్ డీన్ డి. సురేష్ కుమార్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ గంగా, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## సుధాకర్ ఐడియల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక సుధాకర్ ఐడియల్ స్కూల్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో ముఖ్య అతిధిగా చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వర రావు పాల్గొని భోగి మంటలు వెలిగించారు. కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు పలు రకాల విశేష అలంకరణలతో అలరించారు. ఈసందర్భంగా వారిని ముఖ్య అతిధులు అభినందించారు. చురుకుగా పాల్గొంటున్న విద్యార్థులను, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు కనక దుర్గ, సంధ్య, శ్రీదేవి, కనకలక్ష్మి, నాగమణి, విజయలక్ష్మి, అనుష, గాయత్రి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న సామ్‌సంగ్ మొబైల్ ఏఐ అనుభవాల్లో తదుపరి పెద్ద ఆవిష్కరణ

**విజయవాడ మేజర్ న్యూస్ :** కొత్త గెలాక్సీ ఎస్ సిరీస్ ఇప్పుడు, భవిష్యత్తులో మొబైల్ ఏఐ అనుభవాల కోసం మరోసారి విప్లవాత్మక ఆవిష్కరణలను తీసుకురావటానికి సిద్ధమైనది. ఈ నెల 22న, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ శాన్ జోస్‌లో ఈ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. మొబైల్ ఏఐలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్న ఈ కార్యక్రమం సామ్‌సంగ్ డాట్ కామ్, సామ్‌సంగ్ న్యూస్‌రూమ్ ఇండియా, సామ్‌సంగ్ యూట్యూబ్ ఛానెల్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 నుండి ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది.

# శ్రీచైతన్యలో ఘనంగా సంక్రాంతి వేడుకలు











**కృష్ణలంక మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, పండుగ సంస్కృతి సాంప్రదాయాలు, ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి అంటే.. సం అంటే మిక్కిలి, క్రాంతి అంటే అభ్యుదయాన్ని ఇస్తుంది కనుక సంక్రాంతిని పెద్దలు చెబుతారన్నారు. భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యమైన పండుగ అని, సూర్య గమనం, పంటలు ఇంటికి చేతికొస్తాయని అన్నారు. విబేధాలు ఉన్నప్పటికీ అంతా కలిసే ఉండాలని, సామరస్య తతో మెలగాలని సంక్రాంతి సూచిస్తుందన్నారు. భోగి పండుగ నాడు చలిని తట్టుకునేందుకు భోగిమంటలు, శ్రీమన్నారాయణుని ఆశీర్వాదాలు పిల్లలపై ఉండాలని భోగి పళ్ళు పోస్తారన్నారు. పౌరుషానికి ప్రతీకగా కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుందని, పిల్లలు ఆనందంగా గాలిపటాలు ఎగురవేయడంలో పోటీపడతారన్నారు. అడ్డంకులను అధిగమించి ఎగురుతున్న గాలిపటం, జీవితంలోని అడ్డంకులను తొలగించుకుంటు ఉన్నత స్థాయికి చేరుకోవ డానికి నిదర్శనం అని తెలియజేశారు. రంగవల్లుల శోభలో దివ్యత్వం, కళానైపుణ్యం గోచరిస్తాయన్నారు. దేవతలు, తల్లిదండ్రులు, సాటిమనుషులు, ప్రకృతి పట్ల కృతజ్ఞత ప్రేమను ప్రకటించడం పండగలో ప్రాధాన్యముందన్నారు. రైతులు కనుమ పండుగనాడు పంటలు చేతికందడంలో తమకు సహాయ పడిన పశువులను, పశుపక్షాదులను పూజిస్తారని, మూగజీవులు ఆరాధనే పరమావధిగా సాగుతుందన్నారు. గంగిరెద్దుల ఆటలు అతి ప్రాచీనమైన కళగా భావిస్తారని ఉద్ఘాటించారన్నారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్య ప్రదర్శనలు చేసారు. ప్రధానోపాధ్యాయులు కె మహాలక్ష్మి చిన్న పిల్లలకు భోగి పళ్ళు పోసి బొమ్మల కొలువు నిర్వహించారు. పండుగ ప్రాధానాన్ని కనుల పండుగ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈజీయం యం.మురళి కృష్ణ, ఆర్.ఐ.జె రాజేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999